"రాస్తూ ఉండండి. అదే అలవాటు అవుతుంద"న్నారు.

"అన్నట్టు మీరురాసిన కథలన్నింటినీ వేరే తీసి ఉంచానన్నారు. నాకోసారి ఇవ్వాలండీ" అన్నాను.

"దానికేముందండీ! ఈవాళే తీసుకొందురు గాని—"

ఆ సాయంకాలం ఆయన ఇంటికి వెళ్ళి ఆయన కథలు (పత్రికల్లో పడినవన్నీ) తీసుకొచ్చాను.

* * *

మళ్ళీ ఓ వారాన్కి కలుసుకొన్నాం.

"ఏమండీ ఎల్లాఉన్నాయ్?" అన్నారు "కాజువల్‌గా ఆయన కథల్ని ఉద్దేశిస్తూ. "నిర్మొహమాటంగా చెప్పండి. నాకొవలసింది ఇమ్‌పెర్సనల్ క్రిటిసిజమ్."

"చాలా బాగున్నాయండీ. దాంట్లో "నదీసైకతాలు" అద్భుతంగా ఉంది. "ఇదే" ఏమిటిలెండి. అన్నీ చాలా బాగున్నాయ్! అందులో ఇది మరీ బాగుంది."

నే నంటున్నవన్నీ ఆయన చాలా జాగ్రత్తగా వింటూనే ఉన్నారు. అయినా నేనల్లా అనుకోకుండా ఉండడానికని కాబోలు, గోడమీద సినిమా ఎడ్వర్టయిజ్‌మెంటు చూస్తున్నట్టు ఏంగ్యులర్ పోజ్‌లో నిలబడ్డారు.

నేనల్లా ఓ ఐదునిముషాలు ప్రశంసించేశాను. ఓకిళ్ళీకొని ఆయన నాకిచ్చారు.

"కాఫీ తాగుదాంరండీ" అని బలవంతాన క్లబ్‌లోకి లాక్కుపోయారు.

* * *

ఆవేళే వారపత్రిక వచ్చింది. అందులో "సన్ఫ్లవర్" గారి కథ ఉంది. దగ్గరగాఉన్న పార్కులోకి వెళ్ళి కథ చదివాను.

మరునాడు మళ్ళీ నేనూ, మూర్తిగారూ కలుసుకొన్నాం.

"ఏమండీ నాకథ చూశారా?" అన్నారు.

"చదివానండీ" కాస్త తటపటాయించి అన్నా.

"అనవసరంగా పెంచినట్లుంది. దీన్నే ఇంకా కుదిస్తే చదివేవాడికి ఇంటరెస్ట్ ఇంకా ఎక్కువయ్యేది" అని ఉన్నాను.

"అప్పుడే ఓ పెద్ద "క్రిటిక్"లా మాట్లాడుతున్నావే? అన్నట్లు మొఖంపెట్టి టైం చూసుకొని... "ఓ చిన్న ఎంగేజ్‌మెంటు ఉందండీ వస్తా" అని వెళిపోయాడాయన, మరునాడు మూర్తిగారింటికి వెళ్ళా.

"మూర్తిగారూ" అని తలుపుతట్టాను.

"ఇంట్లోలేరని చెప్పు" అన్న మాటలు వినబడ్డాయ్.

ఆయన చిన్న అబ్బాయి తలుపుతీసి "మా నాన్నగారు ఇంట్లోలేరని చెప్పమన్నారండీ" అన్నాడు!

# రంగుమార్చిన రామన్న

వై. వి. శర్మ.

సారవాపంటలు వచ్చిచేరుకున్నాయి. వెంకట్రావు పంతులుగారి భూములన్నీ మగతాకిచ్చినవే. ఆయన పూర్వీకులంతా పెద్ద జమీందారులే. ఆయన యిప్పుడు ఒక మాధ్యమిక తరగతికి చెందిన కుటుంబీకుడు. తనకున్న పదిఎకరాలనుండి వచ్చేరాబడితోనే అన్నీ సర్దుకోవాలి. అంటే, ఇద్దరు కుర్రవాళ్ళనూ కాలేజీలో చదివించటం; తన సంసారమూ; మోయలేని భారాన్ని మోస్తున్నారంటుంది అతని భార్య. నిజమే. కాని ఈ అధునాతన ప్రపంచంలో, తనకొడుకులు గ్రాడ్యుయేట్సు అయినా కాకపోతే వారి జీవనోపాధికి మార్గం చూపించినవాడినికానని పంతులుగారి భయం. అదీకాక తనకొడుకులు పట్టభద్రులు కావాలని ఆయన ఉదాత్త ఆశయం.

ఆయనకు రైతులంటే ఎంతో ప్రేమ; ఆదరమూ; కాని పంతులుగారి ప్రేమనూ, ఆదరాన్నీ చులకనగా తీసుకుంటున్నారు రైతులు. రామన్న, పంతులుగారి రైతులలో ఒకడు. అతని

తాత ముత్తాతలనుండీ, ఈ భూములను సేద్యం చేస్తున్నారు. రామన్నకు పంతులుగారంటేఎంతో భక్తీ భయమూ; పొలంలో పండిన ఏ కాయ గూరఉన్నా, పండుఉన్నా, పంతులుగారికివ్వందే అతని మనస్సు ఒప్పేదికాదు. మగతా ఎప్పుడూ బకాయిఉంచేవాడుకాదు. పంతులుగారింట్లో ఎప్పుడు ఏకార్యం జరిగినా, రామన్న దానికి మేనేజిమెంటు చేసేవాడు. ఇచ్చుకోలేక ఏరైతేనా, మగతాబకాయి పెడ్తే, పంతులుగారు ఓర్మితో ఊరుకునేవారు. రైతులయందు దయా దాక్షిణ్యం చూపుతున్నాడనే నేరంతో, ఆ ఊరి ఈనాందారీ సంఘం పంతులుగారిని బహిష్కరించింది.

కాలం యెప్పుడూ ఒకేరీతిగా నడవదు. మానవులయొక్క నైతికస్థాయిగూడా ఒకమెట్టునుంచి ఒకమెట్టుకు దిగజారుతోంది. న్యాయం, సత్యాలకు స్థానంలేని కాలంలో మనం నడుస్తున్నాము. సారవాపంటువరకూ నడిచిన రామన్న వేరు. ఇప్పుడున్న రామన్న వేరు. సుమారు నెలాపదిహేను రోజుల్లో ఎలక్షన్లు జరుగుతాయి. రైతాంగం అంతా ఒకటైంది. సామాన్య ప్రజానీకంఅంతా అర్థంకాని కమ్యూనిజం అన్న బాటగుండా ప్రయాణం చెయ్యబోతున్నారు. స్వార్థంకోసం అనేకమంది కేపిటలిస్టులుగూడా కమ్యూనిజం అనే దొంగ చొక్కాలు ధరించే రోజులవి. ప్రజానీకానికి ఏమీ పాలుపోలేదు. రామన్న ఆ ఊరి ఛోటా నాయకుడు. చిన్నచిన్న కమ్యూనిస్టు నాయకులంతా, "భూస్వామ్యులంతా నశించాలి. రైతుదేశానికి వెన్నముక! కాంగ్రెసు పోలీసురాజ్యం నశించాలి" అని అర్థంలేని కేకలు వేయసాగారు. పంతులుగారుగూడా ధనికవర్గంలోనివాడని జమకట్టింది ఈ కమ్యూనిస్టు మూక. మాధ్యమికతరగతిగురించి ఆలోచించే అవకాశమే లేకపోయింది ఆ పార్టీకి.

ఆ సంవత్సరం రెండవపంట ఉంది. ఆ దాళవా పంట వచ్చినట్లయితే, తనుచేసిన అప్పు తీర్చవచ్చని పంతులుగారు అనుకున్నారు. కాని తను నమ్మిన రైతాంగం తననే మోసం చేస్తుందని పంతులుగారనుకోలేదు. దాళవాపంట ఎవరికి తోచిన మగతా వారివ్వటం మొదలెట్టారు. దాళవా పంటలో సగం రైతుకి, సగం ఈనాందారుకీ చెందుతుందని అందరికీ తెలిసిందే. ఎలక్షన్లు ముగిసినా, ఆవేడి యింకా తగ్గలేదు. ఆ పార్టీ తన స్వార్థంకోసం, రైతాంగాన్ని, కూలీ జనాన్ని మార్చసాగింది. బకాయి పెట్టిన ఆ డబ్బును పార్టీ ఫండుగా మార్చుకోసాగింది. రామన్న మగతా పూర్తిగా యెగవేశాడు. వెంకట్రావు పంతులుగారు రామన్నను పిల్చిచెప్పారు. 'వెళ్ళవయ్యా' అని ఈసడించాడు. వచ్చేసంవత్సరం పొలం కవులుకివ్వనని బెదిరించారు. "నన్ను కాదని పొలంలో కాలెవరు పెడ్తారో చూస్తా" నని ఎదురు బెదిరించాడు రామన్న. రామన్నను పొలంలోంచి తప్పించారు పంతులుగారు. పొలం యింకొకరికి కవులుకిచ్చారు. ఆ పొలం రామన్న నుండి స్వాధీనం చేసుకునేందుకు పంతులుగారు కోర్టుకుగూడా యెక్కాల్సి వచ్చింది.

ఒక సంవత్సరం గడిచింది. పంచాయితీ ఎలక్షన్లు వచ్చాయి. పంతులుగారివల్ల ఉపకారం పొందినవారంతా యిప్పుడాయనకు బద్ధవిరోధులు. పంతులుగారు మెంబరుకగూడా పోటీ చెయ్యటంలేదు. ఎలక్షన్లు అనే యెరలోపడ్తే తనవంటి మధ్యమ తరగతివాడు సామాన్య పరిస్థితులకు తట్టుకోలేడని పంతులుగారికి బాగా తెలుసు. రామన్న నాయకత్వంతో బయలుదేరిన జట్టు ఆ ఎలక్షను రోజున పంతులుగారింటిముందు దికనిముషాలెక్కువ నిలబడి, "పంతులువంటి ధనిప భూస్వాములు నశించాలి" అని కేకపెట్టింది. పంతులు రైతు విరోధి అని పేరు పెట్టింది ప్రపంచం. "పాపం! వాళ్ళేం చేస్తారు. ప్రజాస్వామ్యం వాళ్ళకటువంటి పాఠాలు నేర్పింది" అని తృప్తిపడ్డారు పంతులుగారు. పంతులుగారి అప్పు, ఆయన సంసారంల్లో అనుభవిస్తున్న కష్టాలు అలానే ఉండిపోయాయి.

ఏకైక ప్రజ్ఞాశాలి కావడం ఎంత అదృష్టం! కాని ఎంత బాధకరం!

—ఆల్‌ఫ్రెడ్ మూసే.